

మిథున్ వైపు రాజంపేట మొగ్గు!

ఎన్నికల్లో లోక్‌సభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీవీ మిథున్‌రెడ్డి వైపు రాజంపేట ఓటర్లు మొగ్గు చూపారు. ఆయన తమ సమీప అభ్యర్థి ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డిపై గెలుపొందారు. -8లో



కూరగాయలు భగభగ

సామాన్య, మధ్య తరగతి ప్రజలను కూరగాయల ధరలు హడలెత్తిస్తున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ధరలు అమాంతం పెరిగిపోయాయి. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.6/27.2

వాతావరణం

జిల్లాలో బుధవారం 27.2 - 36.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ రాజీనామా

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పదవికి ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి రాజీనామా చేశారు. రాజీనామాను ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య బి. ఆంజనేయ ప్రసాద్‌కు అందజేశారు. కాగా ఏఎఫ్‌యూ వ్యవస్థాపక రిజిస్ట్రార్‌గా విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి ఎనలేని సేవలు అందించారు. కాగా ఆయన తిరిగి యోగివేమన విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ శాఖ ఆచార్యులుగా మాతృవిశ్వవిద్యాలయంలో విధులు నిర్వహించనున్నారు.

కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు 'ఫ్లాగ్ మార్చ్'



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

కడప అర్బన్: ఎన్నికల కౌంటింగ్ తరువాత జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు సిబ్బంది బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 'ఫ్లాగ్ మార్చ్'ని ర్వహించారు. కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ జి. ఇబ్రహీం, ఎస్ఐ సంజీవరాయుడు ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. మాసాపేట, అగాడివీధి, సాయిపేట, వక్కలపేట, అల్మాస్‌పేటలోని ప్రధాన దారులగుండా ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగుస్తున్న నేపథ్యంలో కేంద్ర సాయుధబలగాలతో కలిసి ప్రజల్లో భరోసా కల్పించేందుకు.. ఎలాంటి అల్లర్లు జరగకుండా శాంతి భద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో సీఐ సి. భాస్కర్‌రెడ్డి, ఎస్ఐలు జి. మధుసూదన్‌రెడ్డి, రంగస్వామి పాల్గొన్నారు.

ఊహించని పరిణామం..!

- ఇరుపార్టీలకు అంతుచిక్కని ఓటర్ల తీర్పు
- ఎవరికి వారు గెలుస్తామనే ధీమా, విశ్వాసం
- విజేతలకు సైతం భారీ మెజార్టీపై లోపించిన అంచనా
- ఓటర్ల తీర్పుపై సమీక్షలు



సాక్షి ప్రతినిధి, కడప: ప్రజాతీర్పు ఊహించని పరిణామంగా నిలిచింది. అయా అభ్యర్థులు గెలుపుపై విశ్వాసం, ధీమా వ్యక్తం చేశారు. కానీ, ఈ స్థాయిలో ఓటమి చవిచూస్తామని లేదా ఆ స్థాయి మెజార్టీ సొంతం చేసుకుంటామని ఎవ్వరు కూడా అంచనాకు రాలేదు. ఎవ్వరికీ కూడా ప్రజానాడి అంతుచిక్కలేదు. తుదకు జిల్లాలోని రాజకీయ విశ్లేషకులు సైతం అనూహ్య పరిణామాన్ని అంచనా వేయలేకపోయారు. అంతెందుకు విజేతలు సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు. వెరసి ఓటర్ల తీర్పుపై సమీక్ష చేసుకుంటున్నారు.

ఉమ్మడి కడప జిల్లా వైఎస్సార్‌సీపీకి కంచుకోట. 2014, 19 సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ విషయం స్పష్టమైంది. ఏనోట విన్నా మరోమారు జిల్లాలో వైఎస్సార్‌సీపీ సత్తా చాటుతుందని చెప్పుకొచ్చారు. ప్రధాన రాజకీయ పార్టీలు సైతం అదే అంచనాతో ఉండిపోయాయి. ఫలితాలు వచ్చే కొద్ది ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్‌సీపీ 3 సెగ్మెంట్లకు మాత్రమే పరిమితమైంది. 7 స్థానాలు తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. మెజార్టీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంటుందనే ధీమా ఆ పార్టీ అధినేత చంద్రబాబుకు సైతం లేదని పలువురి అభిప్రాయం. ప్రస్తుతం అనూహ్య పరిణామాలపై ప్రజాతీర్పు పట్ల ఎవరికి వారు చర్చించుకుంటున్నారు.

ధీమాకు మించిన విజయం...

ఎన్నికల హడావుడి ప్రారంభమైనప్పటి నుంచి ఈమారు ఆ మూడు స్థానాల్లో గెలుస్తామనే ధీమాను టీడీపీ వ్యక్త పర్చేది. ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురంలో విజయం సాధిస్తామని ఆశించేవారు. ఎన్నికల గడువు సమీపించే కొద్దీ ఆ ధీమా సైతం సడలిపోయింది. మరోమారు ఓటమి చవిచూస్తామనే బెంగ కూడా ఆ పార్టీలో లేకపోలేదు. పోలింగ్ ముగిశాక అభిమానులు ముందస్తు శుభాకాంక్షలు చెప్పినా, ఉండవయ్యా గెలుపొందాక చూద్దామనేవారు. విజయం సాధిస్తాం, మెజార్టీ 5వేలు పైనా అటు ఇటుగా ఉంటుందని చెప్పేవారు. అలాంటి పరిస్థితి ఉండగా ఫలితాల్లో ఊహించని మెజార్టీని సొంతం చేసుకున్నారు. ప్రజా వ్యతిరేకత ఈ స్థాయిలో ఉందని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అస్సలు పసిగట్టలేదు. భారీగా అనుకూలత ఉందని టీడీపీ అభ్యర్థులు కూడా అంచనాకు రాలేదు. అభ్యర్థుల అంచనాలను తలకిందులు చేస్తూ తీర్పు రావడం విశేష పరిణామం.

రాయచోటిలో అనూహ్య తీర్పు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాయచోటి జిల్లా కేంద్రమైంది. విశేష అభివృద్ధి సాధించింది. తాగునీటికి శాశ్వత పరిష్కారం లభించింది. అన్ని రంగాల్లో రాయచోటి దూసుకుపోయింది. మరో వైపు ముస్లిం మైనార్టీ ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతం. తెలుగుదేశం పార్టీలోని అసంతృప్తులతో పాటు గుర్తింపు పొందిన ఓ స్థాయి నేతలు పార్టీ ఫిరాయించారు. ఇలాంటి అనుకూలతలన్నీ ఉన్నప్పటికీ రాయచోటిలో టీడీపీ విజయాన్ని దక్కించుకుంది. ఇంకా చెప్పాలంటే రాయచోటిలో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని 10కి 7 ఇస్తే చాలంటూ పెద్ద ఎత్తున జిల్లాలో పందేలు నడిచాయి. అంటే రాయచోటి మీద జిల్లా వ్యాప్తంగా అంచనా ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పులివెందుల, బద్వేల్, రాయచోటిలో వైఎస్సార్‌సీపీ ఏకపక్షమే అన్నంత విశ్వాసం ఉండేది. అలాంటి చోట కూడా ఓటమి చవిచూడాల్సి వచ్చిందని పరిశీలకులు చెప్పుకొస్తున్నారు. ఊహించని పరిణామంపై వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో సమీక్షిస్తుండగా, ఆ స్థాయి మెజార్టీ దక్కడానికి కారణాల అన్వేషణలో టీడీపీ విజయసారథులుండడం విశేషం.

టైలరింగ్, బ్యూటీ పార్లర్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జులై 1 నుంచి టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజులపాటు కొనసాగే శిక్షణకు18–45 ఏళ్లు కలిగి ఉండాలన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులకు ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



మొక్కలు నాటుతున్న కలెక్టర్ వి. విజయరామరాజు తదితరులు

వైవీయూ: కడప నగరంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, కళాశాల ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు, కడప నగరపాలక కమిషనర్ జి. సూర్యసాయిప్రవీణ్‌చంద్, ఆర్‌డీఓ మధుసూధన్, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్‌లు విచ్చేసి కళాశాల ఆవరణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

7న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 7వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయవాడలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాం సుందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంపై చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

తెలుగు తమ్ముళ్ల ఘర్షణ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట మంగళ కాలనీ సమీపంలోని ఓ వాటర్ ప్లాంట్ కోసం తెలుగు తమ్ముళ్లు బుధవారం ఘర్షణ పడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. నగరిగుట్టలో ఉన్న వాటర్‌ప్లాంట్ తనకు కావాలంటే తనకే అంటూ నగరిగుట్ట తెదేపా నాయకులు వెంకటేశ్, శ్రీను ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఇరువురికి గాయాలవడంతో చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి ప్రమాణ స్వీకారం చేయకముందే తెలుగు తమ్ముళ్ల మధ్య గొడవలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఏపీఎండీసీ డైరెక్టర్ పదవికి రాజీనామా

వేంపల్లె : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) డైరెక్టర్ పదవికి ఈఎస్.సల్మా బుధవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని విజయవాడలోని ఏపీ ఎండీసీ చైర్మెన్‌కు సమర్పించారు. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్సీపీ పరాజయానికి చింతిస్తూ రాజీనామా చేశారు.

73 మంది విద్యార్థులకు అడ్మిషన్లు

కడప ఎడ్యుకేషన్ : విద్యాహక్కు చట్టం 12(1)(సి) కింద కడప జిల్లాలోని కార్పొరేట్ పాఠశాలల్లో ఉచితంగా 73 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. లాటరీ ద్వారా ఎంపికైన విద్యార్థులను నేరుగా ఏ పాఠశాలకు ఎంపిక చేసింది తెలియజేస్తూ వారి సెల్‌ఫోన్‌కు సమాచారాన్ని పంపినట్లు తెలిపారు. ఎంపిక జాబితాను జిల్లాలోని 36 మండలాలకు పంపినట్లు తెలిపారు. సిబి, సిబిఎస్ఇ, ఐసిఎస్ఈ, స్టేట్ సలిబస్ పిల్లలను సమీప ప్రాంతాలలోని నివాస ప్రాంతాల్లో, ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. జాబితాలోని విద్యార్థులను ఒకటో తరగతిలో మాత్రమే అడ్మిషన్ చేసేలా చూడాలని ఆయన ఎంఈవోలను కోరారు. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూస్, సిడబ్ల్యూఎస్ఏ వర్గాలకు ఈ సీట్లు కేటాయిస్తారని తెలిపారు. ఆయా మండలాల ఎంఈఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ నెల 7వతేదీలోగా మండల విద్యాశాఖ అధికారులు ఎంతమంది అడ్మిషన్స్ పొందారో తెలపాలన్నారు.

అక్కాయపల్లె ప్లాజా డిజిటల్ బోర్డు ధ్వంసం



అక్కాయపల్లె ప్లాజా డిజిటల్ బోర్డును పగులగొట్టిన దృశ్యం

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో అల్లరి మూకలు రెచ్చి పోయాయి. కడప నగర అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు ఆకతాయిలు 47వ డివిజన్ పరిధిలోని మరియాపురం చర్చి వద్ద నిర్మించిన అక్కాయపల్లె డిజిటల్ బోర్డును ధ్వంసం చేశారు. ప్రక్కనున్న దిమ్మెను పెకలించారు. మంగళవారం రాత్రి ఆ ప్రాంతంలో ర్యాలీ చేపట్టిన కొంతమంది ఆకతాయిలు ఈ పనిచేసినట్లు తెలుస్తోంది. మూడు రోజులపాటు నగరంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎలాంటి ర్యాలీలకు అనుమతి లేదని చెప్పిన పోలీసులు అల్లరి మూకలు విధ్వంసం సృష్టిస్తున్నా చేష్టలుడిగి చూస్తుండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

మా ఓట్లు ఏమయ్యాయి..?

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మా కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారు.. ఆయన కోసం తామంతా ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటేశాం...కానీ ఎన్నికల ఫలితాల్లో అవి ప్రతిబింబించలేదని పలువురు ఓటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు తమను తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోను చేశాయి. వైఎస్సార్సీపీ బలంగా ఉన్న ప్రాంతాల్లోనూ ఆ పార్టీకి ఓట్లు రాకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

– సాక్షి నెట్‌వర్క్

ఊహించని ఫలితాలు



ఏపీ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఊహించలేని విధంగా ఉన్నాయి. అనేక కార్యక్రమాల ద్వారా ప్రతి గ్రామంలోని ఇంటింటికీ తిరిగాం. ప్రజలందరూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై సంతృప్తిగా ఉన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరాం. ఎన్నికల ప్రచారంలో సైతం ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కనిపించారు. ఎన్నికల ఫలితాల తర్వాత మెజార్టీ ప్రజలు వైఎస్సార్‌సీపీకే ఓటు వేసినట్లు చెబుతున్నారు. పార్టీ ఆదేశాలతో ఈ ఫలితాలు, ఓటములపై పునఃపరిశీలన చేసుకుంటాం.

– శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే, మైదుకూరు

ప్రజలు వైఎస్సార్ సీపీకి ఓట్లువేసి మద్దతుగా నిలిచారు



వైఎస్సార్‌జిల్లా మైదుకూరు నియోజకవర్గంలోని ప్రజలు అత్యధికంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారు. ఎవ్వరిని అడిగినా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వల్ల మాకు లబ్ధి చేకూరింది. మా ఓటు ఆయనకే వేశాం అని చెప్పారు. దీంతో పార్టీకి అత్యధిక ఓట్లు వస్తాయని భావించాం. ఎన్నికల ఓట్లు లెక్కింపు ఫలితం చూస్తే షాక్ అయ్యాం.. మరి ప్రజలు ఓట్లు వేస్తే ఎందుకు ఇలా జరిగిందనేది అర్థం కావడం లేదు ఆలోచిస్తున్నాం.

– రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ మాజీ అధ్యక్షుడు

మా ఓట్లన్ని ఏమయ్యాయో..



మేము, మా కాలనీ వాసులమంతా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేశాం. మాకు జగనన్న అందించిన వైఎస్సార్ చేయూత, ఆసరా, అమ్మఒడి, పింఛన్ కానుక తదితర పథకాలు అందాయి. దీంతో మేమంతా వైఎస్సార్ సీపీకే ఓటు వేశాం. కానీ ఫలితాలు చూస్తే ఏమీ అర్థం కావడం లేదు. అసలు మా ఓట్లు ఫ్యాన్ గుర్తుకు పడ్డాయో? లేదోననే అనుమానం కలుగుతోంది. రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల ఫలితాలు అర్థం కావడం లేదు. మరీ వన్‌వేలో ఉన్నాయి.

– జాఫర్, ఇందిరమ్మ కాలనీ, కమలాపురం

ఎందుకిలా జరిగిందో..



మా ఊరు వైఎస్ జగన్ వెంటే ఉంటుంది. మేము వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేశాం.ఫలితాల్లో మాత్రం ఇతర పార్టీ వారికి అధికంగా వచ్చాయి. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. వాటిలో లబ్ధి పొందిన వారంతా మేము వైఎస్సార్‌సీపీకి ఓటు వేశామని చెబుతున్నారు. కానీ ఇలా జరిగింది అంటే ఫలితాల్లో ఏదో జరిగింది. ఇది ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– గంగిరెడ్డి, లింగాలదిన్నెపల్లె. బి.మఠం మండలం

ఫలితాలు ఇలా ఎందుకు వచ్చాయో..!



ఈ ఎన్నికల్లో మేమంతా వైఎస్సార్‌సీపీకి ఓటు వేశాం. ఇంత దారుణంగా సీట్లు వస్తాయని ఊహించలేదు. మేము వేసిన ఓట్లు అన్నీ ఎటుపోయాయో అర్థం కావడం లేదు. మా గ్రామంలో అందరూ వైఎస్సార్‌సీపీకి అభిమానులే. అయినా ఈ స్థాయిలో ఓట్లు తగ్గడం పట్ల అనుమానాలు కలుగుతున్నాయి. ఇలాంటి ఫలితాలు ఊహించలేదు. ఎందుకు ఇలా వచ్చాయో తెలియడం లేదు.

– సీహెచ్ వినోద్ కుమార్, బుద్దాయపల్లె గ్రామం

మేమంతా వైఎస్సార్‌సీపీకే ఓటేశాం



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఈ ఎన్నికల ఫలితాలు చాలా ఆశ్చర్యానికి గురి చేశాయి. కడప అంటే వైఎస్సార్‌సీపీకి కంచుకోట. ప్రతి డివిజన్‌లోనూ మాకు మెజార్టీ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. అయినా మా ఓట్లు అన్నీ ఈవీఎంలో కనిపించలేదు. మా ఓట్లు పడ్డాయో, లేదో కూడా అనుమానంగా ఉంది.

– కంచుపాటి బాబు, మాసాపేట

టీడీపీకి ఓట్లు పడే ఛాన్సేలేదు



మా డివిజన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంతో బలంగా ఉంది. ప్రజలకు మేము ఎల్లప్పుడు అందుబాటులో ఉండి, వారి సమస్యలను నిత్యం పరిష్కరిస్తున్నాం. రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు అన్నీ ఇప్పించాము. వారి ఓట్లన్నీ మాకే పడ్డాయి. మేమంతా కూడా వైఎస్సార్‌సీపీకే ఓటేశాం. అన్నీ ఓటు పోయాయో ఎవరీ అర్థం కావడం లేదు. టీడీపీకి ఓట్లు పడే ఛాన్సే లేదు.

– ఎస్ఎండీ షఫీ, నాగరాజుపేట

నీట్ ఫలితాల్లో విశ్వసాయి ప్రభంజనం



నీట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో విశ్వసాయి కళాశాల చైర్మన్ సత్యనారాయణ

నెల్లూరు(అర్బన్) : నీట్ ఫలితాల్లో విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించి ప్రతిభ చాటారని ఆ విద్యా సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు. కళాశాలలో కేక్ కట్ చేసి ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

వారు మాట్లాడుతూ తమ కళాశాలలో 110 మందికి పైగా ఎంబీబీఎస్, బీడీఎస్‌లో చేరడానికి అర్హత సాధించారన్నారు. వారిలో దీక్షిత 658 మార్కులు, ప్రేమ్‌సాయి 636, యశ్వంత్ కుమార్ 632, పూజిత 626, గురుచంద్రిక 625, సాయిశ్రియ 620, శ్లోకారెడ్డి 612, సత్యకార్తికేయ 600 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఒకే కళాశాల నుంచి 110 మందికి పైగా డాక్టర్ కోర్సులో చేరడం తమకు సంతోషాన్నిస్తోందన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, ఒత్తిడి లేని శిక్షణ, 5 స్టెప్ ప్రోగ్రాంలతో విజయాలు సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్ పర్సన్ రుక్మిణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కూరగాయలు.. భగభగ

- మార్కెట్‌లో భగ్గుమంటున్న ధరలు
- ఘాటు తగ్గని ఆల్లం ధర
- సామాన్యులకు భారంగా కూరగాయల ధరలు



కడప అగ్రికల్చర్ : సామాన్యుడిని కూరగాయల ధరలు హడలెత్తిస్తున్నాయి. గత ఇరవై రోజులుగా సామాన్య, మధ్య తరగతికి చెందినవారు కొని.. తినలేనంతగా ధరలు అకాశాన్నంటుతున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ధరలు అమాంతం పెరిగిపోయాయి. కూరగాయల దిగుబడి పడిపోవడంతో ఒక్కసారిగా అన్ని కూరగాయల ధరలు పెరిగాయి. రైతు బజార్‌లో రూ.500 పెట్టి కూరగాయలు కొన్నా.. చేతి సంచి నిండా రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. పెరిగిన ధరలతో సామాన్య, మధ్య తరగతికి వాసులు బెంబేలెత్తిపోతున్నారు.

ధరలు పైపైకి

బీన్స్ ధర కిలో రూ. 110కి చేరింది. పది రోజుల కిందట రూ.75 ఉన్న ధర అమాంతం పెరిగి బుధవారానికి కిలో రూ.110కి చేరింది. అదే తరహాలో నాటు కాకరకాయ, చిక్కుడుకాయలు కిలో రూ. 70 చేరాయి. మిగిలిన కాప్సికమ్ కిలో రూ. 80 ఉండగా అలసందలు, బీరకాయలు, క్యారెట్, మునక్కాయల ధరలు కిలో రూ. 60కి చేరాయి. అలాగే మట్టికాయలు, కాలీఫ్లవర్ కిలో రూ.45 ఉండగా, ముల్లంగి, కీరకాయలు కిలో రూ.48కి చేరాయి. బంగాళాదుంప కిలో రూ. 44, దొండకాయ, టమోటపండు, బెండకాయలు, బీట్రూట్ కిలో రూ.40 పలుకుతున్నాయి. క్యాబేజీ కిలో 36, వంకాయలు కిలో రూ.20 చొప్పన రైతు బజారులో విక్రయిస్తున్నారు. సామాన్య, మధ్య తరగతి వాసులు కూరగాయలను కొని తినే పరిస్థితిలో లేరనే చెప్పాలి.

మండుతున్న మిరపకాయ

గత నెల రోజుల నుంచి పచ్చి మిరపకాయల ధర తగ్గడమే లేదు. తొలుత కిలో రూ.25 నుంచి ప్రారంభమై తరువాత కిలో రూ.40 ఆపై రూ.100కు చేరి సెంచరీ కొట్టింది. దీంతో పచ్చడి మెతుకులు తిందామన్న మిరకాయ మంటకు ఎవరూ దాని జోలికి వెళ్లడం లేదు. కిలో తిసుకునే వారు 250 గ్రాములతో సరిపెడుతున్నారు.

కిలో అల్లం రూ.200

గత రెండు నెలల నుంచి అల్లం ధర ఘాటు తగ్గడమే లేదు. కిలో రూ. 200 ధర పలికిన ఆల్లం ఇటీవల కాసింత ధర తగ్గి ప్రస్తుతం కిలో రూ.180కు చేరింది. దీంతో ఆదివారాల్లో సామాన్య, మధ్య తరగతికి చెందిన రంతా అల్లం జోలికి వెళ్లడం లేదు.

ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం

- వైఎస్ జగన్ సీఎం అయ్యాక విలువలతో కూడిన రాజకీయం చేశారు
- మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి. అంజద్ బాషా తెలిపారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రాజకీయాలంటే అబద్ధాలు, మోసం, దగా చేయడమేననే భావన ఉండేదన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నీతి, నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని నేర్పించారన్నారు. 2019 మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ 99 శాతం అమలు చేశారన్నారు. విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి, అమ్మ ఒడి ద్వారా పేద పిల్లలను బడికి పంపించేలా చేశారన్నారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేశారని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఇన్ని చేసినా ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు చూస్తే ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ఇద్దరితో మొదలైందని, పోరాటాల నుంచి ఎదిగిందన్నారు. అక్రమ కేసులు పెట్టి 16నెలలు జైల్లో పెట్టినా మొక్కవోని ధైర్యంతో పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చారన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి, తనపై గెలుపొందిన మాధవీరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ప్రభుత్వం కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. 2005 నుంచి రాజకీయాల్లో ఉన్న తాను ప్రజా సేవకు అంకితమయ్యానని, తన ఇంటి గడప తొక్కి వచ్చిన శత్రువుకు సైతం తన చేతనైనంత సాయం చేశానన్నారు. అదే ధైర్యంతో ఇకపై కూడా ముందుకు వెళ్తానని, ప్రజల సమస్యలను పరిష్కారానికి వారి గొంతుక అవుతానన్నారు. కడప అభివృద్ధికి రూ.2400కోట్లు మంజూరు చేయించి పలు పనులు చేశామన్నారు. కడప నగరం అభివృద్ధి ఆగకుండా కొత్త ప్రభుత్వం కొనసాగించాలని కోరారు. ఎన్నికల్లో తన వెన్నంటి నిలిచిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, బంగారు నాగయ్య, ఎన్. సుబ్బారెడ్డి, ఎస్ఎండీ షఫీ, సీహెచ్ వినోద్, శ్రీరంజన్‌రెడ్డి, జాషువా, బండి ప్రసాద్, అరీఫుల్లా బాషా, మల్లికార్జున పాల్గొన్నారు.

అందరి సమష్టి కృషితోనే విజయం

ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డిలను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరి సమష్టి కృషితోనే బద్వేల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధ విజయం సాధ్యమైందని ఎమ్మెల్సీ డీసీ.గోవింద రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, బద్వేల్ మున్సిపాలిటీ, బద్వేలు రూరల్, గోపవరం, అట్లూరు మండలాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయడంతోనే తన గెలుపు సాధ్యమైందని అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకపోయినప్పటికీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడవద్దని, ప్రతిఒక్కరికీ తమాఉ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాబోవు రోజుల్లో మరింత సమష్టిగా కృషి చేసి ప్రజా సమస్యలపై స్పందిస్తూ క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యేకు సన్మానం

బద్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా రెండోసారి గెలుపొందిన డాక్టర్ సుధను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన ప్రతిఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లెలరాజారాంరెడ్డి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తా శ్రీరాములు, ఆయా మండలాల కన్వీనర్లు మల్లేశ్వర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాలమునిరెడ్డి, పోలిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గోవిందరెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మండలాల నాయకులు పాల్గొన్నారు.

కర్రలతో దాడి.. ఒకరి మృతి

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఎర్రమాచుపల్లె పంచాయతీ పరిధిలోని ప్రకాశంపల్లెలో నాగమల్లయ్య (55)పై ఆయన బంధువులు బుధవారం కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో నాగమల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఏఎస్ఐ నాగరాజు సమాచారం మేరకు.. నాగమల్లయ్య ఇటీవలే పలు కేసుల్లో శిక్షను అనుభవించి జైలు నుంచి విడుదలయ్యారని, ఇతని మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో అందరిపైకి వాదులాటకు దిగేవాడని తెలిసిందన్నారు. ఇందులో భాగంగా ఈ విషయాన్ని జీర్ణించుకోలేక కుటుంబీకులు కర్రలతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

మిథున్ వైపు రాజంపేట మొగ్గు!

- మాజీ సీఎంను నిరాకరించిన ఓటర్లు
- పెద్దిరెడ్డికి అండగా నిలిచిన వైనం
- దిగ్గజాలను మట్టి కరిపించి హాట్రిక్
- మెజార్టీ చూపించిన సెగ్మెంట్ ఓటర్లు
- ఎంపీతోపాటు, ఎమ్మెల్యే సీటు కైవసం



పీవీ మిథున్‌రెడ్డి



ఎంపీ అభ్యర్థిగా పీవిమిథున్‌రెడ్డి గెలుపొందినట్లుగా డిక్లరేషన్‌ను కలెక్టరు చేతుల మీదుగా అందుకుంటున్న ఎంపీ ప్రతినిధులు

రాజంపేట : సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి వైపు రాజంపేట ఓటర్లు మొగ్గు చూపారు. తమ సమీప అభ్యర్థి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిపై 76వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు (చిత్తూరు) నియోజకవర్గాలున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట వాసులు పెద్దిరెడ్డికి అండగా నిలిచారు.

హ్యాట్రిక్ ఎంపీగా..

రాజంపేట లోక్‌సభ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించారు. జిల్లా కేంద్రమైన రాయచోటి సాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కౌంటింగ్‌లో మిథున్‌రెడ్డి ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యత చాటుతూ ముందుకు దూసుకెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ గాలి వీచిన తరుణంలో మిథున్‌రెడ్డి మాత్రం మెజార్టీలో వెనుకంజ వేయలేదు. రాజంపేట, రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె, రైల్వేకోడూరు నియోజక వర్గాల్లోనూ మిథున్‌రెడ్డి పట్ల ఓటర్లు సానుకూలత వ్యక్తం చేసినట్లు కనిపించింది.

రాజకీయ దిగ్గజాలను..

తొలిసారిగా మిథున్‌రెడ్డి 2014లో 1,74,062 ఓట్ల మెజారీతో గెలుపొందారు. నాటి భాజపా అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరిని ఆయన ఓడించారు. 2019లో మిథున్‌రెడ్డి 2,68,284 ఓట్ల మెజార్టీ సాధించారు. అప్పట్లో టీడీపీ అభ్యర్థి సత్యప్రభపై విజయం సాధించారు. ప్రస్తుతం ముచ్చటగా మూడోసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని ఓడించి రాజకీయ దిగ్గజాలను మట్టి కరిపించిన నాయకుల్లో ఒకరిగా నిలిచారు.

ఒకే కుటుంబంలో ముగ్గురు

ఎన్నికల రణరంగంలో పెద్దిరెడ్డి కుటుంబం పట్టు నిలుపుకొంది. ఆయా నియోజకవర్గాల్లో మాత్రం పెద్దిరెడ్డి మరోమారు విజయ కేతనం ఎగురవేసి పట్టు నిలుపుకొంది. ప్రధానంగా పుంగనూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె సెగ్మెంట్ నుంచి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి జెండా ఎగురవేయగా, రాజంపేట లోక్‌సభ స్థానం నుంచి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విజయబావుటా ఎగురవేశారు. ఇలా పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో కూడా పెద్దిరెడ్డి కుటుంబం గెలుపుతో తమ సత్తా చాటింది. రాజంపేట వాసులు తమ ఓట్లను ఆకేపాటి, మిథున్ రెడ్డిలకు వేసి గెలిపించారు. గతంలోనూ వీరు ఎమ్మెల్యేగా, ఎంపీలుగా కలిసి పనిచేశారు. అయితే గత ఎన్నికల్లో అమర్‌నాథరెడ్డికి టిక్కెట్ రాకపోవడంతో ఆయన పోటీ చేయలేకపోయారు. అయితే ఈసారి పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనూహ్యంగా అమర్‌నాథ్‌రెడ్డి పేరు అభ్యర్థిగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

నియోజకవర్గం	పీవీ మిథున్‌రెడ్డి	నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి
రాజంపేట	926661	76884
కోడూరు (ఎస్సీ)	69510	73391
రాయచోటి	100200	70568
తంబళ్లపల్లె	95682	73871
పీలేరు	83614	90602
మదనపల్లె	92611	88180
పుంగనూరు	104833	83534
పోస్టల్ బ్యాలెట్	11734	5733

మిథున్‌రెడ్డి మెజార్టీ ఇలా..

లోక్‌సభ ఫలితాలలో రాజంపేట 15,777, మదనపల్లె 4, 431, తంబళ్లపల్లె 21, 811, రాయచోటి 29, 632, పుంగనూరు 21,299 మెజార్టీఓట్లు ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి వచ్చాయి. మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి పీలేరులో 6988, రైల్వేకోడూరులో 3,801 ఓట్ల మెజార్టీ వచ్చింది. కూటమి అభ్యర్థులు గెలిచిన రైల్వేకోడూరు, మదనపల్లె, రాయచోటిలో ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డికి మెజార్టీ రావడం చర్చనీయమైంది.